# అంతరాంతరాలు

అప్లికేషన్ వ్రాసి సంతకం పెట్టి రమేశ్‌కు అందించింది సరిత. తను ఒక కంప్యూటర్ కంపెనీలో ఉద్యోగానికి దరఖాస్తు పెట్టుకొంటోంది. మొన్న మొన్ననే ఇంజనీరింగ్ పూర్తి చేసింది. రమేశ్ ఎం.బి.ఎ. చేశాడు. పెద్ద సంస్థలోనే ఉద్యోగం వీళ్ళ పెళ్ళయి ఆరు నెలలే అయింది. ఇప్పుడిప్పుడే సంసార యాత్ర ప్రారంభించారు. కొన్నాళ్ళు తోడుగా వుండడానికి రమేశ్ మేనత్త వచ్చి వుంటోంది.

"మీరు ఆఫీసుకు వెడుతూ ఈ అప్లికేషన్ డాక్యుమెంట్సు ఇచ్చి వెడతారా లేక రిజిష్టరు పోస్టులో పంపమంటారా? పోస్టాఫీసైతే కాస్త ఆగి నేనే వెళ్తాలెండి. అప్లికేషన్ సరిగా వుందేమో ఒకసారి చూడండి."

రమేశ్ అన్ని పేపర్లూ చూశాడు. అంతా కరక్టే. మరి- కళ్ళెత్తి సరితను చూశాడు.

"ఏమైనా మిస్ చేశానా?"

"లేదు. కానీ నీ పేరు..."

"ఏమిటి స్పెల్లింగ్ మిస్టేకా; నో... హౌ కెన్ ఇట్ బి?"

"అది కాదు. బి. సరిత అని రాశావు. అలవాటుకొద్దీనా?" అన్నాడు నవ్వుతూ.

"అలవాటేమిటి? అదే నా అసలు పేరు కదా!"

"అది నీ మెయిడన్ నేమ్. బంగారుపాళెం సరిత, బి. సరిత. ఇప్పుడు పెళ్ళయిన తర్వాత జి. సరిత అంటే గంగవరపు సరిత కావాలి కదా!"

"అలా కంపల్షన్ ఏమీ లేదు. ఇష్టమున్న వాళ్ళు మార్చుకుంటారు. లేకపోతే లేదు."

"నీకు ఇష్టం లేదనుకోవాలా?"

"అలా ఏం కాదు. ఇలా వున్నా నష్టమేమీ లేదనిపించింది. కాకపోయినా నా సర్టిఫికెట్లు, ఓటర్ ఐడెంటిటీ కార్డు అన్నిటిలోనూ అలాగే వుంది కదా!"

"ఉంటే ఏం? మార్చుకోవచ్చు. కోర్టులో అప్లికేషన్ పెట్టుకొని ఆ తర్వాత అవసరమనుకుంటే నోటిఫికేషన్ పేపర్లో ఇవ్వచ్చు."

"ఎందుకొచ్చిన గొడవ? ఇప్పుడు నష్టమేముంది?"

"ఏది సహజంగా జరగాలో అలాగే జరగాలి కాని మనమే ప్రత్యేకంగా వుండాలా?" చురుగ్గా చూశాడు.

సరిత నవ్వేసింది. "ఈ విషయాలు తీరిగ్గా మాట్లాడుకుందాం. ఈ అప్లికేషన్ పంపటానికి ఇంకా టైముందిలెండి. ప్రస్తుతం మీరు టిఫిన్ తీసుకొని ఆఫీసుకు వెళ్ళండి. తర్వాత దీని విషయం చూద్దాం."

చిరునవ్వులతో, జోక్‌లతో ప్రేమాభిమానాలు చిప్పిలుతున్న చూపులతో టిఫిన్ ముగిసింది. రమేశ్ స్నానానికి వెళ్ళినప్పుడు వంటింట్లో జానకమ్మకు సాయం చేయడానికి వెళ్ళింది సరిత.

"పెద్దమ్మా, ఇంకా ఏదైనా చేయాలా లేక హాట్ బాక్స్‌లో లంచ్ సర్దెయ్యనా?" అని అడిగింది.

"అయిపోయిందమ్మా ఈ కూర కాస్త తిరగమోత వేసేస్తే..."

"ఆ లోపుగా చపాతీలు రుద్దనా?"

"అవెప్పుడో అయిపోయాయి. నీవు టిఫిన్ బాక్స్ తయారు చెయ్యి" అంది జానకమ్మ.

జానకమ్మ పదహారో ఏటే వితంతువైంది. జీవితమంతా పుట్టింట్లోనే గడిచింది. అన్నదమ్ముల మధ్య పెరిగింది. వారి కుటుంబాలతోనే తన జీవితం ముడివేసుకుంది. పిల్లలంటే అభిమానం. వాళ్ళ బాగోగులన్నీ తనే చూసుకొంటోంది. నరసింహ శతకం, సుమతీ శతకం, రామాయణం, భగవద్గీత, భాగవతం వంటి పుస్తకాలు చదువుకొంటుంది. శ్రావ్యంగా తనలో తనే పాడుకొంటుంది. నిష్ఠగా పూజలూ, అవీ చేసుకొంటుంది. బయటి ప్రపంచం ఎలా మారుతుందో పట్టించుకోదు. టి.వి. వగైరాలు అక్కరలేదు. సినిమాలతో సంబంధం లేదు. ఆమె డిక్షనరీలో ప్రేమ, శ్రద్ధ, కర్తవ్యంగాక మరే పదాలూ వున్నట్టనిపించదు.

రమేశ్ ఆఫీసుకు వెళ్లాక సరిత న్యూస్ పేపర్ చదవడంలో మునిగిపోయింది. ఒక ఇంగ్లీషు పేపర్, తెలుగు పేపర్ తెప్పించుకొంటారు. రమేశ్ న్యూస్ మ్యాగజైన్లూ అవీ పట్టుకొస్తుంటాడు. పగలు ఎలా గడిచిపోతుందో తనకే తెలీదు. అసలు దేనికీ టైమున్నట్లే అనిపించదు. అందరూ ఇంట్లో వున్న వాళ్ళకు పనేమీ వుండదనుకొంటారు. అది ఇంటిపనే కానక్కరలేదు. ఈ ఆధునిక యుగంలో ఒక వ్యక్తి తలచుకోవాలే గాని ఎన్ని వ్యాపకాలుండవు? తన విషయమే ఆలోచిస్తే చదవటానికి ఎంత మెటీరియల్ లేదు! ఏది చదవాలా అని ఎంచుకోవటమే కష్టమైపోతుంది. తను నేర్చుకున్న కంప్యూటర్ టెక్నాలజీలో కూడా రెప్పపాటులో ఎన్నెన్ని మార్పులొస్తున్నాయి! అవీ తనకూ కొద్దో గొప్పో తెలియాలి కదా! దేశ విదేశ విషయాల సమస్యలు, పరిష్కారాల అవగాహన కూడా రావాలి కదా!

ప్రస్తుతం తన వద్ద ఇంటర్నెట్ లేదు గానీ అదీ త్వరలోనే ఏర్పాటు చేసుకోక తప్పదు. దానికీ ఒకటి రెండు గంటలు కేటాయించక తప్పదు. ఎంత ముక్తసరిగా చేసినా ఇంటి మేనేజ్‌మెంట్ వుండనే వుంది కదా! కొందరు తమకేమీ తోచటం లేదని ఎందుకంటారో తనకు తెలీదు. తన మటుకు ఇప్పుడే టైం మేనేజ్‌మెంట్ కష్టమవుతోంది. ఉద్యోగంలో చేరితే టైం మరీ కుంచించుకు పోతుంది. కాని తప్పదు. ఇది తను ఎన్నుకొన్న జీవనశైలి. దానికనుగుణంగా తను జీవించాలి. దీనికి చుట్టూ ఉన్న వాళ్ళను నిందించి లాభం లేదు.

భోజనాలప్పుడు జానకమ్మ అంది "ఈ నెలాఖరుకు ఊరికి వెళ్ళిపోదామనుకొంటున్నాను."

"ఎందుకు పెద్దమ్మా? నువ్వు వెళ్లిపోతావంటే దిగులుగా వుంటుంది. ఒక్కదాన్నీ ఇల్లు నడుపుకోలేను."

"నాలుగు నెలలైంది కదా! ఇంకా అలవాటు కాలేదా? ముందు ముందు నీ సంసారం నీవు చేసుకోవాలి గాని ఎల్లకాలం నీకు తోడెవరుంటారు? ఊరి దగ్గర ఎన్నో పనులుంటాయి. పిల్లలకు పరీక్షలు, వ్యవసాయమున్న ఇల్లు. ఒకరు లేకపోయినా పనులు జరిగేది కష్టం. మీ అత్తా, చిన్నత్తా వున్నా వాళ్ళ పనులు వాళ్ళవి. నేను లేకపోతే ఇబ్బందే పాపం."

"మరి కొన్నాళ్ళుండు పెద్దమ్మా. నాకేదైనా ఉద్యోగం రానీ. ఇంటి పనులన్నీ ఒక దారినపడనీ. నాకైతే నువ్వెప్పుడూ మా దగ్గరే వుండాలనిపిస్తుంది."

"అంతే... మొదటిసారిగా అమ్మా, నాన్నలను, అక్క చెల్లెళ్ళను వదలి దూరంగా వుండటమంటే అలాగే వుంటుంది. అయినా అలవాటు చేసుకోక తప్పదు."

సరిత ఏం మాట్లాడలేదు. తన వాళ్ళను తను మిస్ చేస్తున్న మాట నిజమే. కానీ కొత్త జీవితమూ కొత్త కొత్తగా బాగానే వుంది. ఎంతో అవగాహన వుండి, అపురూపంగా చూసుకొనే భర్త, ప్రేమానురాగాలు కురిపించే ఈ పెద్దమ్మ, నగరం అందించే చిన్న చిన్న సరదాలు, భర్తతో పాటు షికార్లు అన్నీ బాగానే వున్నాయి.

భోజనాల తర్వాత అప్లికేషను, డాక్యుమెంట్లు అన్నీ మరోసారి చూసుకుంది. తను త్వరగా ఉద్యోగంలో చేరాలి. లేకపోతే టెక్నాలజీలో తను వెనకబడిపోతుంది. ఒకసారి వెనకబడితే ఆ వేగం అందుకోవటం కష్టం. ఎంతైనా ఒక సంస్థలో పని చేసిన దానితో సమానంగా ఇటువంటి విషయాలు స్వంతంగా నేర్చుకోలేరు కదా!

ఆ రాత్రి రమేశ్ అన్నాడు... "రేపు నీ ఇంటి పేరు మార్చుకోవడానికి అప్లికేషన్ ఇద్దామా?"

“అనవసరమైన శ్రమ” అంది సరిత.

“అదేమిటి? నువ్వు నా భార్యవైన తరువాత పూర్తిగా నా జీవితంలో కలిసిపోవాలని లేదా?”

“కలిసి పోయాను కదా! ఇంటి పేరు మారిస్తేగాని అది కుదరదా ఏమిటి?”

“ఇంకానయం. మన ఆచారం ప్రకారం కేవలం ఇంటి పేరే మార్చుకోవాల్సి వస్తోంది. మహారాష్ట్ర, కర్నాటక వంటి కొన్ని ప్రాంతాలలో అసలు పేరు కూడా మార్చుకొని అత్తగారింట్లో కొత్త పేరుతో వస్తుంది కోడలు తెలుసా!”

“తెలుసు. పంజాబ్ ప్రాంతంలో పెళ్ళి కూతురు ఒక వస్తువు కూడా తను ఇది వరకు వాడుకొన్నది వెంట తీసుకుపోదు. అప్పటి కప్పుడు అన్నీ కొత్త బట్టలే. అన్నీ కొత్త వస్తువులే. అంటే తన అస్తిత్వాన్ని పూర్తిగా మర్చిపోవటమన్నమాట. అంతగా తనను తాను శూన్యం చేసుకొంటేగాని భర్తతో జీవితం ప్రారంభించలేదు. అదీ ఆచారం.”

“వాటన్నిటి కంటే మన పద్ధతే మేలు కదా!”

“ఏ విధంగా! కాళ్ళూ చేతులూ కట్టి వేయటం కంటే ఒక చేతికి మాత్రం గొలుసులాగి కట్టే మేలంటారా? నేను ఎవరి ఆచారాలకూ వ్యతిరేకిని కాను. కానీ ప్రతి వ్యక్తీ తనకు ఏది బాగుంటే ఆ పద్ధతి అవలంబిస్తే మేలను కొంటాను. ప్రతిదీ కాస్త ఆలోచించి ఆచరించాలి. గుడ్డెద్దు చేలో పడ్డట్టు కాదు.”

“అలాగా? చైనా షాపులో ఎద్దుపడటమంటే తెలుసా?” అని అడిగాడు రమేశ్.

నవ్వుతూ “తెలీదు” అంది సరిత.

“అయితే కాచుకో” గదంతా నవ్వులతో మారుమోగింది.

మరునాడు “అప్లికేషన్ ఇవ్వు. వాళ్ళాఫీసులో ఇచ్చి వెళ్తాను” అన్నాడు రమేశ్.

“ఇంకా టైముంది లెండి.”

“అయితే మాత్రం? మన పని అయిపోయింది కదా! ఎందుకు ఆలస్యం చెయ్యాలి?”

అప్లికేషన్ వున్న కవరు అతని ఆఫీసు పోర్టు ఫోలియోలో పెట్టింది సరిత. ఆ తర్వాత టిఫిన్ విషయం చూడటానికి వంటింట్లోకి వెళ్ళింది.

“సరితా, సరితా, ఇలా రా” అని పిలిచాడు రమేశ్.

“పెద్దమ్మా, ఈ నీళ్ళు మరిగాక ఈ ఉప్మా రవ్వ వేసేయ్. ఇక్కడ స్టౌవ్‌పై పాలు పెట్టాను” అని సరిత వంటింట్లో నుండి ఇవతలకు వచ్చింది.

"రేపు ఉద్యోగంలో చేరితే కష్టమే" అన్నాడు రమేశ్.

"అప్పుడు షెడ్యూల్సును బట్టి మన కార్యక్రమాలు, మార్పులు, చేర్పులు, సవరింపులు... పెద్దమ్మకైతే ఎప్పుడెప్పుడు ఊరెళ్ళిపోదామా అని వుంది."

"నిజమే. ఇంటి దగ్గర అత్త లేకపోతే కష్టమే. మన బాధ్యతలు మనం నెత్తిన వేసుకోక తప్పదు. మన ఏర్పాట్లు మనం చేసుకోక తప్పదు."

"ఎందుకు పిలిచారు?"

"ఓ మరిచే పోయా? నిన్ను చూస్తే ఈ క్షణంగాక గడచిన క్షణంగాని, రాబోయే క్షణంగాని జ్ఞాపకముండవు."

"బాగానే వుంది. అక్కడ సగంలో పని వదిలి పెట్టి వచ్చాను. ఉదయం పూట ఎంత హడావుడో, టెన్షనో మీకు తెలిసినట్లు లేదు. మా మేనేజిమెంట్ స్కిల్స్ అన్నీ ఇక్కడే అవసరమవుతాయి. అదీ సింగిల్ హాండ్ మేనేజిమెంట్ సార్."

"చూడు... చూడు... ఈ ఐటమ్ చూడు. అందుకే పిలిచాను" అని పేపరందించాడు రమేశ్.

అది ఒక ఉద్యోగినికి, వాళ్ళ సంస్థకు వచ్చిన తగాదా. అదీ సెంట్రల్ గవర్నమెంట్‌లో. ఆమె పెళ్ళయిన తర్వాత ఆఫీసుకు ఫార్మల్‌గా తెలియజేసింది. అది రెండేళ్ళ క్రితం. ఇప్పుడు తన భర్త సురేశ్ పాండేకు కాన్పూరుకు ట్రాన్స్ఫర్ అయినందున తననూ కాన్పూరు బ్రాంచికి బదిలీ చేయమని అడిగింది. సాధ్యమైనంత వరకు భార్యా భర్తల పోస్టింగ్ ఒకే ఊరిలో లేక దరిదాపుల్లోనో వుండే వీలు కల్పించాలని ఒక రూలుంది. కాని ఆమె పై అధికారి "ఈమెకు పెళ్ళి కాలేదు. పెళ్ళికి ముందూ సునీతా జైన్. ఇప్పుడూ సునీతా జైన్. భర్త అంటున్న అతని పేరేమో సురేశ్ పాండే. పెళ్ళయితే ఈమె పేరుకు పాండే అని జోడించాలి కదా!" అని వాదిస్తున్నాడు. పేరు మార్చుకోవడం, మార్చుకోక పోవడం తనిష్టమని, దానిని పెళ్ళికి సాక్ష్యంగా తీసుకోకూడదని ఈమె వాదిస్తోంది... కేసు కోర్టులో వుంది.

ఈ వార్త చదివి, "ఆ అధికారికి ఆ అమ్మాయి మీద కోపంగా వున్నట్టుంది. అందుకే ఈ పనికి మాలిన అడ్డంకులు" అంది సరిత.

"అతను అభ్యంతరం చెప్పటం నిరాధారమంటావా!"

"అంతే మరి. చట్టబద్ధంగా అంతే. నేను ఇంజనీరింగ్ చేస్తున్నప్పుడు మాతో పాటు ఒక నైజీరియన్ కూడా చదువుకొనేవాడు. అతను ఎత్తుగా, లావుగా, నిగనిగలాడుతూ, నల్లగా వుండేవాడు. అతని నవ్వు మాత్రం వెలుగులు

చిమ్ముతుండేది. అతను తన సర్‌నేమ్‌లో క్రిస్టీనా అని పెట్టుకొన్నాడు. తనే చెప్పాడు అందరూ తండ్రి పేరు పెట్టుకొంటే తాను తల్లి పేరు పెట్టుకొన్నానని. నాకు బలే ముచ్చటేసింది. ఇంకొక పేరు పొందిన జర్నలిస్టున్నాడు. తను తన ఇంటి పేరు, భార్య ఇంటిపేరు కలిపి పెట్టుకొన్నాడు. ఆమె కూడా అంతే. నాకు అది చాలా సరదాగా అనిపించింది. గొప్పపని అనిపించింది. నిజానికి చట్టబద్ధంగా ఇంటిపేరు మార్చుకోవాలని ఎక్కడా లేదు. తమ ఇష్టమో, ఆచారమో ఏదైనా పాటించవచ్చు. యూనో సమ్‌థింగ్?"

"వాట్?"

"హ్యూమన్ రైట్స్ అంటే మానవుల అధికారాలకు, సంబంధించిన విషయంలో యునైటెడ్ నేషన్స్ ఏమి చెప్పిందో తెలుసా? వివాహమైనప్పుడు తమ ఇంటిపేరు ఏది పెట్టుకోవాలో నిర్ణయించుకొనే హక్కు స్త్రీ పురుషులిద్దరికీ సమానంగా వుంటుంది. కాబట్టి సునీతాజైన్ సంజాయిషీ చెప్పుకోనవసరం లేదు. తను కోరిన ట్రాన్స్‌ఫర్ అయి తీరుతుంది."

"రండి! టిఫిన్ టేబిల్ మీద పెట్టాను" అని పిలిచింది జానకమ్మ.

టిఫిన్ చేస్తూ "నిజానికి ఇంటి పేరు మార్చుకోవటం అంత ముఖ్యమైనదేమీ కాదు. నీకు అలవాటైన బి. సుజాతగానే రాసుకో" అన్నాడు రమేశ్.

అప్పుడే పచ్చడి టేబిల్ దగ్గరకు తెచ్చిన జానకమ్మ "ఇందాక చెప్పావే ఎవరో ఇద్దరి ఇంటి పేర్లూ కలిసి వచ్చేటట్లు పెట్టుకొన్నారని అలా చెయ్యకూడదూ" అంది.

"పెద్దమ్మా! యు ఆర్ రియల్లీ గ్రేట్" అంది సరిత.

"ఇలా పేర్లు జోడించుకుంటూ పోతే ముందు ముందు తరాలకు ఎన్నెన్ని పేర్లుంటాయో. అది సాధ్యమయ్యే పనేనా?" అన్నాడు రమేశ్.

"ఇప్పుడే కదరా అన్నారు ఎవరికి నచ్చిన పేరు వాళ్ళు పెట్టుకోవచ్చుని."

"బ్రిల్లియంట్ పెద్దమ్మా మా అందరికంటే నువ్వే ముందున్నావు."

"వెనుకటి తరంలో పుట్టాను కదా" అంది జానకమ్మ.

"మా అత్తది గొప్ప మనసు" అన్నాడు రమేశ్.

ఆంధ్రజ్యోతి వారపత్రిక

22 డెసెంబర్ 2000